క్లుప్తంగా

కోయంబత్తూర్ వెళ్లనున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోయంబత్తూర్ వెళ్లనున్నారు. ఈనెల 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో తాగునీరు అంశంపై కోయంబత్తూర్‌లో జరిగే రీజనల్ వర్క్ షాప్‌లో పాల్గొననున్నారు. తిరిగి ఫిబ్రవరి 2న కమిషనర్ అందుబాటులో ఉంటారు. అప్పటి వరకు అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరించనున్నారు

క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన అవసరం



గుంటూరు మెడికల్: సర్వేకల్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక పాత గుంటూరు వీఆర్ హైస్కూల్‌లో శ్రీ బాలాజీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.సంధ్యారాణి మాట్లాడుతూ యువతుల్లో ఎక్కువగా సర్వేకల్ క్యాన్సర్ పెరిగిపోతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా కట్టడి చేయవచ్చని చెప్పారు. 45 సంవత్సరాలు దాటిన మహిళలు, బాలికలు వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా సర్వేకల్ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. వ్యాక్సిన్ రూ.1800లకే అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

వైద్య రంగానికి వన్నె తెచ్చిన డాక్టర్ నాగేశ్వరరెడ్డి



గుంటూరు మెడికల్: దేశంలో రెండో అత్యుత్తమ అవార్డు అయిన పద్మ విభూషణ్‌కు ఎంపికైన డాక్టర్ నాగేశ్వరరెడ్డి వైద్య రంగానికి వన్నె తెచ్చారని సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో డాక్టర్ నరేంద్రరెడ్డి హైదరాబాదులోని ఏఐజీ హాస్పిటల్‌లో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో నాగేశ్వర్‌రెడ్డి ధైర్యం చెప్పి ఆహార నియమాలు పాటించేలా చేసి లక్షలాది మందిని కాపాడారని గుర్తు చేశారు. వైద్య రంగంలో విశేష కృషి చేసి తమకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన పద్మ విభూషణ్‌కు ఎంపికవ్వడం రెండు తెలుగు రాష్ట్రాల వైద్యులకు గర్వకారణమని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు.

గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు



నెహ్రూనగర్: ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డిలను బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళిత, బహుజన, పీడిత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోరారు. లాడ్జి సెంటర్‌లో ఉన్న బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బండి సంజయ్, విష్ణువర్ధన్ రెడ్డిల వ్యాఖ్యలకు నిరసనగా వారి చిత్రపటాలను దహనం చేశారు. కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, శిఖ సురేష్, పాటిబండ్ల కోటేశ్వర రావు, సాదు మాల్యాద్రి, వేల్పూరి నరసింహా రావు, సుధాకర్, కె. నాగేశ్వరరావు, సుబ్రమణ్యం, రవికుమార్ పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి కేంద్రం గ్రాంటు ఇవ్వాలి

లక్ష్మీపురం: రాజధాని నిర్మాణానికి నిధులను కేంద్రమే గ్రాంటుగా ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. రేపటి నుండి నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని తాడేపల్లి నుంచి ప్రారంభమైన రాజధాని జాతా గురువారం సాయంత్రం గుంటూరు చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో నేతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనైనా రాజధానికి నిధులు వస్తాయనుంటే అప్పుగా ఇప్పిస్తామని మళ్లీ మోసం చేశారని తెలిపారు. అప్పుగా తీసుకుంటే ఆ భారం మళ్లీ ప్రజలపైనే పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, రాజధాని ప్రాంత కార్యదర్శి యం.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, పాల్గొన్నారు.

మొక్కవోని దీక్ష .. రోగులపై ఆపేక్ష



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న విజయకుమారి

- నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారికి ప్రశంసా పత్రం
- నర్సింగ్ సేవలకు ఆరుసార్లు బెస్ట్ నర్సు అవార్డు
- జీజీహెచ్‌లో క్యాన్సర్ రోగులకు మనోధైర్యం కల్పిస్తూ నిత్యం కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: ఆసుపత్రిలో రోగులకు ఉత్తమ సేవలు అందిస్తూ జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయకుమారి ఆరు సార్లు బెస్ట్ నర్సు అవార్డు అందుకున్నారు. క్యాన్సర్ మహమ్మారి సోకినప్పటికీ ఏమాత్రం భయపడకుండా మొక్కవోని దీక్షతో జయించారు. క్యాన్సర్ రోగులకు నిత్యం కౌన్సెలింగ్ చేస్తూ ఆదర్శంగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు. జనవరి 26న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకుని అందరి మన్ననలు పొందారు.



విజయకుమారి

40 ఏళ్లుగా వైద్య సేవలు

తెనాలి సమీపంలోని మూల్పూరు గ్రామానికి చెందిన ఆవుల విజయకుమారి గుంటూరు జీజీహెచ్ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో 1985లో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) కోర్సు చదివారు. పూర్తి చేసిన మూడు నెలల్లోనే ప్రభుత్వ నర్సుగా ఉద్యోగంలో చేరి 40 ఏళ్లుగా నర్సింగ్ సేవలు అందిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో సుదీర్ఘకాలం నర్సింగ్ సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. హెడ్ నర్సుగా 2009లో, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా 2024లో ప్రమోషన్ పొందారు. ఏ క్యాడర్‌లో ఉద్యోగం చేస్తున్నా నర్సింగ్ సేవల్లో తనదైన ముద్ర వేస్తూ పలుమార్లు అవార్డులు సొంతం చేసుకున్నారు. బెస్ట్ స్టాఫ్ నర్సు అవార్డును రెండు సార్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. బెస్ట్ హెడ్ నర్సు అవార్డును నాలుగు సార్లు అందుకున్నారు. తాజాగా జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ నర్సింగ్ సేవలకు అవార్డు అందుకున్నారు.

క్యాన్సర్‌పై విజయం

ఆవుల విజయ కుమారి 14 సంవత్సరాల కిందట క్యాన్సర్ సోకి తీవ్ర ఇబ్బంది పడ్డారు. అయినప్పటికీ ఏమాత్రం భయపడకుండా చికిత్స పొందుతూ దాన్ని జయించారు. క్యాన్సర్ వార్డులోనే విధులు నిర్వహిస్తూ చికిత్స కోసం వచ్చే రోగులకు కౌన్సెలింగ్ చేస్తూ భరోసా కల్పిస్తున్నారు. రోగులను చిరునవ్వుతో పలకరిస్తూ తాను క్యాన్సర్‌ను జయించానని, భయపడకుండా చికిత్స చేయించుకుంటే జీవితం కొనసాగించవచ్చంటూ ప్రతిరోజూ కౌన్సెలింగ్ చేస్తున్నారు.

యూనియన్‌లో కీలకపాత్ర

నర్సింగ్ సేవలతోపాటు నర్సింగ్ యూనియన్‌లో కూడా ఆవుల విజయకుమారి కీలక పాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సంఘం బలోపేతం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. సేవా గుణం, దానగుణంలోనూ తనకు తానే సాటి అనిపించేలా పనిచేస్తున్నారు. ఇటీవల నాట్కో క్యాన్సర్‌సెంటర్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు అకాల మృత్యువుకు గురైంది. తక్షణమే స్పందించి తాను కొంత నగదును విరాళంగా సేకరించి యూనియన్ సభ్యులతో సైతం విరాళాలు సేకరించి మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా నిలబడ్డారు.

మార్చి 24న ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల 'చలో పార్లమెంట్'



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

లక్ష్మీపురం: ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 24న నిర్వహించనున్న 'చలో పార్లమెంటు'ను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన యూనియన్ బాధ్యుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శివాజీ మాట్లాడుతూ పార్లమెంట్‌లో హిట్ అండ్ రన్, భారత న్యాయ సంహిత 106(1)(2)లు అమల్లోకొస్తే డ్రైవర్లు రోడ్లు పైకి రావాలంటేనే తీవ్ర భయాందోళనలకు గురవుతారని తెలిపారు. దేశంలో రోడ్ల నిర్మాణ వ్యవస్థలో మార్పులు చేయకుండా డ్రైవర్ని బాధ్యతలు చేయడం కోసం ఇటువంటి చట్టాలు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే నూతన చట్టాలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో పార్లమెంట్‌లో రవాణా కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, నాయకులు షేక్ మస్తాన్ వలీ, కె.శ్రీనివాసరావు, నరేంద్ర, ఎం.వి. సుబ్బారావు, షేక్ కాజా, బి.కోటేశ్వరరావు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నిరసనలను జయప్రదం చేయాలి

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆల్ ట్రేడ్ యూనియన్ పిలుపులో భాగంగా ఫిబ్రవరి 5న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీఐటీయూ నేతలు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక చట్టాలను కాల రాసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆరోపించారు. అందులో భాగంగా 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావాలనే ప్రయత్నం కార్మికులకు తీవ్ర ద్రోహం చేయడమేనని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను హరించే ప్రయత్నాలు తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు బి.లక్ష్మణరావు, బి. ముత్యాలరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.అరుణ్, ఎం.హనుమంత రావు జిల్లా నాయకులు సత్యనారాయణ ఏపీఎఫ్‌టీయూ న్యూ కూరపాటి కోటయ్య, ఐఎఫ్‌టీయూ మేకల రవి పాల్గొన్నారు.

సచివాలయ అధికారులకు అర్జీలు అందజేత

పట్టణాలలో పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు భూమిని ఇవ్వాలని కోరుతూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల 94, 95, 96 వార్డు సచివాలయాల వద్ద అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చే దిశగా రాజీలేని పోరాటాలు చేస్తామని తెలిపారు. అర్జీలను త్వరితగతిన పరిశీలించి అర్హులైన పేద ప్రజలకు స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం కోసం పెరిగిన ధరలకు అనుగుణంగా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, చిన్నపోతుల విజయకుమార్, నాయకులు పాల్గొన్నారు

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు రంగం సిద్ధం

- ఎన్నికల బరిలో 12 మంది కార్పొరేటర్లు
- తొలుత 17 మంది నామినేషన్ల దాఖలు
- ఐదుగురు ఉపసంహరణ
- ఫిబ్రవరి 3న ఎన్నికలు
- అదే రోజు ఫలితాల వెల్లడి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఫిబ్రవరి 3న జరగనున్న ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు తుది పోటీలో ఉన్నారని, నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజైన గురువారం ముగ్గురు చేసుకున్నారని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు తెలిపారు. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు 17 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. వారిలో పఠాన్ రిహాన (57), తేలుకుట్ల హనుమాయమ్మ (19)లు బుధవారం ఉపసంహరణ చేసుకున్నారని చెప్పారు. గురువారం పోతురాజు సమత(6), అచ్చాల వెంకటరెడ్డి (30), షేక్ రోషన్ (29) కూడా ఉపసంహరణ చేసుకున్నారని తెలిపారు. ఉపసంహరణల అనంతరం తుది పోటీల్లో అడకా పద్మావతి, అంజలి మర్రి, ఈరంటి వర ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, గోపి శ్రీనివాస్, దాసరి లక్ష్మీదుర్గ, దూపాటి వంశీ బాబు, నూకవరపు బాలాజీ, ముప్పవరపు భారతి, యాట్ల రవికుమార్, రాజలత బూసి, షేక్ మీరావలి ఉన్నారని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికలు జరుగుతాయని, అనంతరం ఓట్ల లెక్కింపు అదే రోజు జరుగుతుందని ఆయన తెలిపారు.



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ వెంకటరెడ్డి

వీణ విద్వాంసుడు ఫణినారాయణకు పురస్కారం

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై ఫిబ్రవరి 2న రామరాజు ఫౌండేషన్, రామరాజు ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది విద్యాంసుల వీణ కచేరీలు, పద్మశ్రీ డాక్టర్ ఈమని శంకరశాస్త్రి స్మారక పురస్కార ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు రామరాజు శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఆయన మాట్లాడారు. పద్మశ్రీ డాక్టర్ ఈమని శంకరశాస్త్రి స్మారక పురస్కారాన్ని ప్రముఖ వీణా విద్వాంసులు వడలి ఫణినారాయణ (హైదరాబాద్)కు అందజేస్తామని ఆయన తెలిపారు. పురస్కార ప్రదానం అనంతరం ఆయన కచేరీ ఉంటుందని పేర్కొన్నారు. రామరాజు లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యక్రమానికి పుర ప్రముఖులు హాజరవుతారని, సంగీత అభిమానులు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

టెన్త్ విద్యార్థినులకు అల్పాహారం అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులకు గురువారం లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాశరావు సహకారంతో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మొహ్మద్ ఖాసిం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలిపారు. గుంటూరు లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం అధ్యక్షుడు డాక్టర్ రాజేష్ రోషన్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ పీఆర్వో వెంకట నరేష్ మాట్లాడుతూ 2013లో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు ఆర్చి నిర్మించామని, ప్రభుత్వ విద్యార్థులకు క్లబ్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అల్పాహారం అందజేస్తున్న డాక్టర్ రాజేష్ రోషన్

నేటి నుంచి శ్రీకన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాలు



గోడప్రతుల ఆవిష్కరణలో ఆర్యవైశ్య నాయకులు

నగరంపాలెం: ఆర్.అగ్రహారం శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 31 నుంచి ఆత్మార్పణ దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య నాయకులు ఈరంటి వరప్రసాద్ తెలిపారు. అమ్మవారి దేవస్థానం ఆవరణలో గురువారం ఆత్మార్పణ దినోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు దినోత్సవాలు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం వేకువజామున పంచామృతాభిషేకం, అనంతరం శ్రీలక్ష్మీ గణపతి, శ్రీ వాస్తు, శ్రీ రుద్ర, శ్రీ చండీ హోమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తారని పేర్కొన్నారు. 102 మంది కన్యలు అమ్మవారి కలశాలతో ఊరేగింపు జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఈసీ సభ్యులు కొనకళ్ల సత్యం మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని, సాముహిక లక్ష కుంకుమార్చనలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త మండలి నిడమానూరి సురేష్, బైసాని ఇందుమతి, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుడివాడ రవి, కోటా శేషగిరి, కోశాధికారి బొలిశెట్టి పాపారావు, ఆర్యవైశ్య క్లబ్ నాయకులు గజవల్లి అంకరావు, అవరపల్లి శ్రీను, తల్లం శేఖర్, మహిళా నాయకురాలు ఓలేటి షర్మిల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

తెలుగు వైద్యుల గొప్పతనాన్ని చాటిన డాక్టర్ నాగేశ్వరరెడ్డి

లక్ష్మీపురం: డాక్టర్ దువ్వూరి నాగేశ్వరరెడ్డికి దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ రావడం హర్షణీయమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు వైద్యుల గొప్పతనాన్ని దేశానికి మరోసారి డాక్టర్ నాగేశ్వరరెడ్డి చాటారని తెలిపారు. నటుడు,ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, సామాజిక ఉద్యమకారుడు మందకృష్ణ మాదిగలకు పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంపై వారికి అభినందనలు తెలిపారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, నీటి పన్నుల వసూళ్లపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన నల్లచెరువు, నంబూరి సుభాని కాలనీ, శివరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆస్తి పన్ను వసూళ్లు, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చేపట్టే అభివృద్ధి పనులకు పన్నుల వసూళ్లు కీలకమని తెలిపారు. నూరు శాతం వసూళ్లకు వార్డ్ సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్‌లలో మురుగు పారుదల లేకపోవడం గమనించారు. రోడ్ల మీద భవన నిర్మాణ వ్యర్థాలు, సామగ్రి వేసే వారిని తక్షణం తొలగించే విధంగా చూడాలని ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు.

కొనసాగుతున్న శ్రీ మద్రామాయణ ప్రవచనం



ప్రవచనం చేస్తున్న సంతోషకుమార్‌శాస్త్రి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ముప్పవరపు కేశవరావు శత జయంతి సందర్భంగా నిర్వహిస్తోన్న శ్రీ వాల్మీకి మహర్షి ప్రణీత శ్రీ మద్రామాయణ ప్రవచన నవాహ జ్ఞానయజ్ఞం గురువారం కూడా కొనసాగింది. ముప్పవరపు వెంకటసింహాచలశాస్త్రి ఆధ్వర్యంలో జరగ్గా, భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పురాణ కథా భారతి డాక్టర్ డాక్టర్ బాచంపల్లి సంతోషకుమార్ శాస్త్రి యుద్ధకాండలోని (1–62వ సర్గ వరకు) ప్రవచనాన్ని ప్రారంభించారు. సీతను కనుగొన్న హనుమంతుని శ్రీరాముడు ప్రశంసించి ఆలింగనం చేసుకోవడం, యుద్ధానికి వానర సైన్యాన్ని సిద్ధం చేయడం, సాగరంపై వారధి నిర్మాణం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉప కర్మాగారాల ముఖ్య తనిఖీ అధికారి డి.రాధాకృష్ణ (కాకినాడ) పాల్గొన్నారు.

గాంధీజీ మార్గమే జాతికి భగవద్గీత



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

లక్ష్మీపురం: గాంధీజీ చూపిన అహింసా మార్గమే భారత జాతికి భగవద్గీత అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో, మార్కెట్ సెంటర్‌లో మాజీ శాసన సభ్యుడు మస్తాన్‌వలి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీజీకి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డంపాల్ విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇన్‌చార్జి బిళ్లా సునీల్, సందీప్, చుక్క చంద్రపాల్, రాచకొండ జాన్‌బాబు, సుధీర్ బాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ....

నగరంపాలెం: స్థానిక ఏటుకూర్ రోడ్డులో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్ గుంటూరు మహిళా, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రాయవరపు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు రాయవరపు అనురాధ, ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి విజయలక్ష్మి, రీజినల్ చైర్మన్ మున్నలూరి గౌరీశంకర్ కమిటీ చైర్మన్లు కనమర్లపూడి సత్యనారాయణ, మొగిలి సతీష్‌కుమార్, మద్దాలి సుధాకర్, దేసు రవికుమార్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు బాబు, పవన్ కట్టుబడి ఉంటారా ?

లక్ష్మీపురం: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఎన్నికల సమయంలో చెప్పినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కట్టుబడి ఉంటారా ? అని కాంగ్రెస్ పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు షేక్ మస్తాన్‌వలి ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో పార్లమెంట్‌లో బిల్లు ఆమోదానికి వస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో చెప్పినట్లు వ్యతిరేకించటానికి కట్టుబడి ఉన్నారో లేదో స్పష్టం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా తేల్చి చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ అధినేత, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద గురువారం ఉచిత మెగా మెడికల్ క్యాంపును మేడికొండూరు మండలం పాలడుగులో నిర్వహించారు. హార్ట్, బ్రెయిన్, క్యాన్సర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, యురాలజీ, డెంటల్, గైనకాలజీ విభాగాల వైద్యులు హాజరయ్యారు. రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ పక్షవాత రిస్క్ ఫాక్టర్స్, లక్షణాలు, నివారణా మార్గాలు గురించి వివరించారు. అధిక రక్తపోటు వల్ల 50 శాతం పక్షవాతం వస్తుందని తెలిపారు. రక్తపోటు (బీపీ) సైలెంట్ కిల్లర్ అంటరాని, ప్రతి ఒక్కరూ అదుపులో ఉంచుకోవాలని చెప్పారు. గుండె సంబంధిత జబ్బులు, పెరిఫెరల్ వాస్కులర్ జబ్బుల గురించి డాక్టర్ ఫణిరాజు వివరించారు. లేజర్ చికిత్స ద్వారా కిడ్నీలో రాళ్ల తొలగింపు గురించి యురాలజిస్ట్ డాక్టర్ శరవణ కుమార్ తెలియజేశారు. నీరు ఎక్కువగా తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు రాకుండా నివారించవచ్చని తెలిపారు. శిబిరంలో 400 మందికి పైగా గ్రామస్తులు వైద్య సేవలు వినియోగించుకున్నారని హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మతెలిపారు. అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, మందులు సైతం పంపిణీ చేసినట్లు వెల్లడించారు. శిబిరంలో అనస్తీషియా డాక్టర్ శాఖమూరి అనిల్, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అయ్యప్ప శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ డాక్టర్ రాజేష్, ఆర్థోపెడిక్స్ డాక్టర్ వివేక్, డెంటల్ డాక్టర్ స్వాతి, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి వెంకటేష్, డైటీషియన్ కావ్య, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో న్యూరోపతికి అడ్డుకట్ట



మాట్లాడుతున్న డాక్టర్ సేవకుమార్

గుంటూరు మెడికల్: దీర్ఘకాల మధుమేహ బాధితులు, కొన్ని విటమిన్ల లోపాలు గల వారిలోనూ తలెత్తే నరాల సమస్య 'న్యూరోపతి'ని ముందు జాగ్రత్తల ద్వారా నిరోధించవచ్చునని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ టి.సేవ కుమార్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఉచిత న్యూరోపతి పరీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ మేనేజర్ పి. నిర్మలరాణి అధ్యక్షత వహించారు. డాక్టర్ సేవ కుమార్ మాట్లాడుతూ మధుమేహ బాధితులలో దీర్ఘకాలం రక్తంలోని షుగర్ శాతం అసాధారణంగా అధిక స్థాయిలో ఉంటుందని తెలిపారు. దీనివల్ల నరాల కణాలపై ఉండే కణత్వచం దెబ్బతిని అసాధారణ మార్పులు వస్తాయన్నారు. ఫలితంగా అరిచేతులు, అరికాళ్లు తిమ్మిర్లు ,మంటలు ఉంటాయని వివరించారు. కాళ్లు చేతులలో మంటలు గలవారు మధుమేహ పరీక్షలు, మధుమేహం లేని వారు ముఖ్యంగా విటమిన్ బీ 12 వంటి పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు. ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి. నిర్మలరాణి మాట్లాడుతూ న్యూరోపతిపై ప్రజల్లో శాస్త్రీయ అవగాహన అవసరమని తెలిపారు. ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రెండుసార్లు న్యూరోపతి పరీక్ష ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. అనంతరం న్యూరోపతి పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సలహాలు అందజేశారు.